రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై సమీక్ష చేస్తున్న గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ఆర్‌వైవీ లబ్ధిదారుల ఎంపిక త్వరగా చేపట్టాలి

గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, మే 16 : రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో బల్దియా అధికారులతో ఆర్‌వైవీ పథకం లబ్ధిదారుల ఎంపిక పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంపిక చేసిన అర్హుల దరఖాస్తులను బ్యాంకులకు పంపించాలని ఆదేశించారు. గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్ల నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్లకు 36 వేల దరఖాస్తులు వచ్చాయని అధికారులు వివరించారు. అదనపు కమిషనర్ జోనా, నోడల్ అధికారులు అలివేలు, రాజేశ్వర్, ఎల్‌బీఎం రాజు, డిప్యూటీ కమిషనర్ రవీందర్ పాల్గొన్నారు.

పింగిళి డిగ్రీ కాలేజీలో రెండు కొత్త కోర్సులు

హనుమకొండ చౌరస్తా, మే 16 : హనుమకొండ వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ డిగ్రీ మహిళా కాలేజీలో కొత్తగా రెండు కోర్సులు ప్రవేశపెట్టినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి తెలిపారు. బీఎస్సీ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్, బీకాం ఈ-కామర్స్ కొత్తగా చేర్చామన్నారు. దోస్త్ ద్వారా బీఏ, బీకాం కంప్యూటర్స్, బీకాం ఈ-కామర్స్, బీబీఏ, బీఎస్సీ ఫిజికల్ సైన్స్, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీఎస్సీ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్‌లో అడ్మిషన్ పొందొచ్చని తెలిపారు.

అనుబంధ కళాశాలలు న్యాక్‌కు సిద్ధం కావాలి

- నూతన గ్రేడింగ్ సిస్టం ప్రకారం నడుచుకోవాలి
- కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, మే 16 : నూతన గ్రేడింగ్ సిస్టం ప్రకారం అనుబంధ కళాశాలలు న్యాక్‌కు సిద్ధం కావాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. కేయూ ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ సంచాలకులు షమితా అధ్యక్షతన 'సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్క్రీం అండ్ పాలసీస్(సీఆర్ఐఎస్పీ) స్వచ్ఛంద సంస్థ వారి సెంటర్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ క్వాలిటీ ఆఫ్ గ్రాడ్యుయేషన్ అండ్ ఎక్స్‌లెన్స్'లో భాగంగా కాకతీయ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీ, శాతవాహన యూనివర్సిటీలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు, ఐక్యూఏసీ అధికారులు, అవగాహన కుదుర్చుకున్న 22 కళాశాలల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అనుబంధ కళాశాలల్లో ఉన్నత విద్య, నాణ్యత పెంపుదలలో విశ్వవిద్యాలయాలు ప్రధాన భూమిక వహిస్తాయన్నారు. మారుతున్న సూచనలకు అనుగుణంగా కళాశాలలు డేటాబేస్‌తో సిద్ధంగా ఉండాలన్నారు. రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. నూతన విషయాలతో పాటు న్యాక్ అక్రిడిటేషన్‌లో వస్తున్న మార్పులపై పూర్తిస్థాయి అవగాహన ఉండాలన్నారు. విశ్వవిద్యాలయ ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ సంచాలకులు మాట్లాడుతూ.. అనుబంధ డిగ్రీ కాలేజీ విద్యార్థుల్లో నైపుణ్యపెంపు, ఉద్యోగ సమర్థత పెంచడంతో పాటు కళాశాలలో క్వాలిటీ ఇంప్రూవ్ చేయడం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో డీన్ సీడీసీ ఆచార్య వరలక్ష్మి, అకాడమిక్ మెంటర్లు ఏవీ రావు, అచ్యుతాదేవి, సీఆర్ఐఎస్పీ స్టేట్ లీడ్ రమ, లక్ష్మీపతిరావు పాల్గొన్నారు.

తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా వెంకట్రామరెడ్డి..

కాకతీయ విశ్వవిద్యాలయం, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సంయుక్తంగా ఆగస్టులో 3 రోజుల పాటు నిర్వహించే 'తెలంగాణ సైన్స్ కాంగ్రెస్-2025'కు ఆర్గనైజింగ్ సెక్రటరీగా భౌతికశాస్త్ర విభాగ ఆచార్యులు వెంకట్రామరెడ్డిని నియమిస్తూ వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. విశ్వవిద్యాలయ ప్రతిపాదనల మేరకు హైదరాబాద్ తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జనరల్ సెక్రటరీ నుంచి '3 రోజుల తెలంగాణ సైన్స్ కాంగ్రెస్' నిర్వహించడానికి విశ్వవిద్యాలయానికి అనుమతి వచ్చిందని రామచంద్రం వెల్లడించారు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం..

కాకతీయ విశ్వవిద్యాలయ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నిర్వహణ తీరుతెన్నులను వీసీ నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్షల నియంత్రణాధికారి కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు తిరుమలాదేవి, వెంకటయ్య ఉన్నారు.

గ్రేటర్‌లో పలు హోటళ్లకు జరిమానా

తనిఖీలు చేసి జరిమానా విధిస్తున్న అధికారులు

వరంగల్, మే 16 : గ్రేటర్ కార్పొరేషన్ లో ట్రేడ్ లైసెన్స్ లేకుండా, నింబధనల కు విరుద్ధంగా నిర్వహిస్తున్న హోటళ్లపై బల్దియా అధికారు లు శుక్రవారం దాడులు చేసి రూ.62 వేల జరిమానా విధించారు. సీఎంహెచ్‌వో రాజారెడ్డి ఆదేశాల మేరకు బల్దియా అధికారులు దాడులు చేశారు. 51వ డివిజన్ ఎక్సైజ్‌కాలనీలోని 'నాటు కోడి.. చిటిగారెలు' హోటల్‌ను ట్రేడ్ లైసెన్స్ లేకుండా నిర్వహిస్తుడంటంతో రూ.30 వేల జరిమానా విధించారు. హంటర్ రోడ్డులోని కడాయి రెస్టారెంట్‌కు రూ. 30 వేలు, నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తు న్న సాయి కిరాణా షాపు యాజమానికి రూ. 2 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. నిబంధనలు ఉలంఘించి, ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, సంపత్‌రెడ్డి, నిరంజన్, అనిల్ పాల్గొన్నారు.

రైల్వే ఏడీఈఎన్‌గా నర్సింహారావు బాధ్యతలు

కాజీపేట, మే 16 : కాజీపేట రైల్వే సబ్ డివిజన్ ట్రాక్ మిషన్ ఏడీఈఎన్‌గా శుక్రవారం నర్సింహారావు బాధ్యతలు స్వీకరించారు. గతంలో కాజీపేట ట్రాక్ మిషన్ ఏడీఈఎన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన రవీందర్‌ను రైల్వే ఉన్నతాధికారులు సికింద్రాబాద్ రైల్వే డివిజన్ కార్యాలయానికి బదిలీ చేశారు. సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లో కన్‌స్ట్రక్షన్ శాఖలో ఏడీఈఎన్ విధులు నిర్వర్తిస్తున్న నర్సింహారావును కాజీపేట సబ్ డివిజన్ ట్రాక్ మిషన్ ఏడీఈఎన్‌గా బదిలీ చేశారు. నూతన ఏడీఈఎన్‌ను కార్యాలయ అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో రైల్వే కార్యాలయ అధికారులు ఇమ్రాన్ అహ్మద్, దిలీప్, ప్రవీణ్, రాజు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతి

హనుమకొండ చౌరస్తా, మే 16 : తమ సమస్యలను పరిష్కరించాలని కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ ఈసం నారాయణ, పుల్లా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కేయూ పరిపాలనా భవనంలో వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రాంచంద్రంను కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్సిటీలో ఎస్సీ కేటగిరైజేషన్ చేపట్టాలని, డీఆర్, ఏఆర్, సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 2010, 2023 పీఆర్సీలను వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బందికి అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ, అడ్వాన్స్‌డ్ శాలరీ, బేసిక్ పే, అదనపు డ్యూటీ అలవెన్స్ చెల్లించాలన్నారు. వర్సిటీలో బ్యాక్‌లాగ్ పోస్టులపై కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. సంఘం నేతలు నమిండ్ల కిరణ్‌కుమార్, రవికుమార్, దయాకర్, బొక్క మొగిలి, భాస్కర్, ప్రతాప్ పాల్గొన్నారు.

ఉర్సుకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీవో నారాయణ

దామెర, మే 16 : మండలంలోని ఓగులాపురం సమీపంలోని హజ్రత్ సైలానీబాబా ఉర్సుకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో నారాయణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వివిధ శాఖల అధికారులతో ఈ నెల 21 గంధం (జాతర) తీసుకురావడం, 22న జరిగే ఖవ్వాలీ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. జాతరకు రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తున్న దృష్ట్యా జాతరలో విద్యుత్, తాగునీరు, ఆర్టీసీ బస్సుల సౌకర్యం, పారిశుధ్య నిర్వహణ ఉండాలని, జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. దర్గా పీఠాధిపతి సైలానీబాబా మాట్లాడుతూ.. జాతరలో భక్తులకు కనీస సౌకర్యాలతో పాటు ఉచిత అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పరకాల ఏసీసీ సతీశ్‌బాబు, అమీర్‌బాబా, ఎస్‌కే మోయిన్, అహ్మద్‌బాబా, కొమ్మాలు, తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీ దేవి, ఎంపీడీవో కల్పన, ఆత్మకూరు సీఐ సంతోష్, ఎస్సై కొంక అశోక్, విద్యుత్ శాఖ ఏడీ దేవేందర్, ఏఈ గుర్రం రమేశ్ పాల్గొన్నారు.

లేగ దూడల అక్రమ రవాణా

వాహనం పట్టివేత.. ముగ్గురి అరెస్ట్

భీమదేవరపల్లి, మే 16 : మండలంలోని రామ్‌నగర్ తండాలో పోలీసులు ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న మూడు లేగ దూడలు, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్టు చేసినట్లు వంగర ట్రైనీ ఎస్సై హేమలత తెలిపారు. ట్రైనీ ఎస్సై నేతృత్వంలో కానిస్టేబుళ్లు రాజు, రమేశ్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సిద్దిపేట – హనుమకొండ ప్రధాన రహదారిపై బొలెరో వాహనంలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు గుర్తించారు. వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, అందులో మూడు లేగ దూడలు కనిపించాయి. వాహనంలో ఉన్న వారిని విచారించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన జాఫర్, ఇబ్రహీం, కనకం సదానందం పశువులను వివిధ ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి బక్రీద్ పండుగ సందర్భంగా అధిక లాభం పొందే ఉద్దేశంతో ఇతర జిల్లాలకు అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. నిందితులపై పశు సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి, పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. లేగ దూడలను ధర్మసాగర్ (ముప్పారం) గోశాలకు తరలించినట్లు వెల్లడించారు.

పిల్లలను సర్కారు బడికి పంపండి

శాయంపేట, మే 16 : సర్కారు బడికి పిల్లలను పంపించాలని ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతున్నారు. అన్ని సదుపాయాలున్న సర్కారు బడికి పంపిస్తే ఉత్తమ విద్యాబుద్ధులు అందిస్తామని వివరిస్తున్నారు. మండలంలోని పెద్దకోడెపాక, జోగంపల్లి గ్రామాల్లో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. దూరం నుంచి వచ్చే విద్యార్థులకు రూ.6వేలు రవాణా భత్యం ఇస్తామని చెప్పారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దకోడెపాకలో విద్యార్థులను చేర్పించాలని కోరారు. పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. కరపత్రాలను ముద్రించి అందజేస్తున్నారు. హెచ్ఎం సారయ్య, ఏఏపీ చైర్‌పర్సన్ వసంత, సీఆర్‌పీ వంశీ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య..

ఆత్మకూరు : బడి బాట కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు : నాణ్యమైన విద్య, ఉత్తమ ఫలితాల కోసం విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే జాయిన్ చేయాలని ఎంపీపీఎస్ ఆత్మకూరు(గొల్లవాడ) పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెండెం రాజు అన్నారు. పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి ఉచిత పాఠ్య, నోట్ బుక్కులు, రెండు జతల దుస్తులు, మధ్యాహ్న భోజనం అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా బడిబాట కరపత్రాలను ఆవిష్కరించారు. టీచర్లు పుష్పలత, నరసింహస్వామి, వసంత, కవిత పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఎరువులు విక్రయించాలి

మాట్లాడుతున్న ఏసీపీ సతీశ్‌బాబు

పరకాల, మే 16 : ప్రభుత్వ నిబంధనల మేరకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయించాలని ఏసీపీ సతీశ్‌బాబు పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ, పోలీసుల ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని పలు మండలాలకు చెందిన విత్తనాలు, ఎరువుల డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలని, తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. స్టాక్ నిల్వలు, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, ధరల పట్టిక, స్టాక్ నిల్వలను రైతులకు కనపడేలా ఉంచాలని పేర్కొన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే లైసెన్సులు రద్దు చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ శ్రీనివాస్, సీఐ క్రాంతికుమార్, డివిజన్ పరిధిలోని ఏవోలు గంగాజమున, యాదగిరి, జైసింగ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేడీసీ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ శ్రీనివాస్

హనుమకొండ చౌరస్తా, మే 16 : హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య గుర్రం శ్రీనివాస్ నియమితులయ్యారు. ప్రస్తుతం రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న శ్రీనివాస్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించగా, శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

నడికూడ, మే 16 : పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న ప్రతి రైతునూ ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసి 11 అంకెల ఫార్మర్ ఐడీని కేటాయిస్తామని, రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే కేంద్ర ప్రభుత్వం నుంచి పంటల భీమా, సీఎం కిసాన్ వంటి పథకాలు వర్తిస్తాయని మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున పట్టాదారు పాస్ పుస్తకం కలిగి ఉన్న రైతులు వ్యవసాయ విస్తరణ అధికారి దగ్గర ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు.

క్రీడాకారులు హెచ్‌సీఏని నమ్మి మోసపోవద్దు..

టీసీఏ జిల్లా కార్యదర్శి జైపాల్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, మే 16 : క్రీడాకారులు చట్టబద్ధత లేని హెచ్‌సీఏ చేస్తున్న ప్రయత్నాలను నమ్మరని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్(టీసీఏ) జిల్లా కార్యదర్శి జైపాల్‌రెడ్డి విమర్శించారు. జిల్లాల్లో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ చేస్తున్న అభివృద్ధి గుర్తిస్తూ టీసీఏతో కలిసి పనిచేయాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌ను 2021 జూలై 11న బీసీసీఐ ఆదేశించి తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని ఆరు నెలల గడువు విధించిందన్నారు. ఆ ఆదేశాలను అమలు చేయడంలో హెచ్‌సీఏ కాలయాపన చేస్తుండడంతో టీసీఏ బాంబే హైకోర్టును ఆశ్రయించగా, మార్చి 21 టీసీఏతో హెచ్‌సీఏ సంప్రదించాలని ఆదేశించిందని, మార్చి 29న ఉప్పల్ స్టేడియంలో సమావేశం జరిగిందని తెలిపారు. జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి హెచ్‌సీఏతో సాధ్యం కాదని, హెచ్‌సీఏకు మనీ మీద ఉన్న ఇంట్రస్ట్ క్రికెట్ మీద లేదని అర్థమవుతుందన్నారు. అసోసియేషన్ మెంబర్స్‌కు హెచ్‌సీఏని అడిగే దమ్ము, ధైర్యం లేకే జస్ట్ టైం పాస్ చేస్తున్నారని జైపాల్‌రెడ్డి మండిపడ్డారు.

చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఆర్వో వైవీ గణేశ్

హనుమకొండ, మే 16 : యాసంగి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకూ మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ హాన్‌లతో కలిసి మంత్రి ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో వైవీ గణేశ్, డీఆర్డీవో మేన శీను, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం మహేందర్, డీసీవో సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ఆగస్టు 30న మున్నూరుకాపు మహాసభలు

హనుమకొండ చౌరస్తా, మే 16 : హైదరాబాద్‌లో ఆగస్టు 30న గ్లోబల్ మున్నూరుకాపు అసోసియేషన్ మహాసభలు జరుగుతాయని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య పటేల్ తెలిపారు. శుక్రవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మున్నూరుకాపులు సంఘటితమై రాజకీయాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కటకం పెంటయ్య, సంఘం నేతలు కుమారస్వామి, సంపత్, సారంగపాణి, సత్యనారాయణ, కోల జనార్దన్, పరమేశ్వర్, శ్యామ్, కోల కృష్ణ పాల్గొన్నారు.

గట్లకానిపర్తిలో అంగడి ప్రారంభం

శాయంపేట, మే 16 : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో వారాంతపు సంత(అంగడి) ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండేలా వారాంతపు సంతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 33 మంది వ్యాపారులు స్టాళ్లను ఏర్పాటు చేసి కూరగాయలు, నిత్యావసర సరుకులను అందుబాటులో పెట్టినట్లు తెలిపారు. సూరంపేట, పులుకుర్తి, నర్సింహులపల్లి, పోచారం గ్రామాల ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతన బోర్డు సభ్యుడు బాసాని చంద్రప్రకాశ్, మాజీ ఎంపీటీసీ గడ్డం కేశవమూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ

హనుమకొండ చౌరస్తా, మే 16 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీని డీఈవో వాసంతి ప్రారంభించారు. శుక్రవారం కాజీపేట (24,972), కమలాపూర్ (15,932) మండలాలకు సంబంధించిన ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను సంబంధిత మండల విద్యాశాఖాధికారి, క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ల ద్వారా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. పాఠ్య పుస్తకాలు హనుమకొండ కిషన్‌పుర గోదాం నుంచి పంపిణీ చేసినట్లు తెలిపారు.

ట్రేడ్ యూనియన్ల హక్కులను కాలరాయొద్దు

కాజీపేట, మే 16 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల పని గంటలు పెంచుతూ, ట్రేడ్ యూనియన్ల హక్కులను కాల రాయడం సరికాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ అన్నారు. పట్టణంలోని ఇంపీరియల్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం ఇమ్మడి సాగర్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ కార్మిక సంఘాలు జూలై 9న అఖిల భారత సమ్మెకు నిలుపునిచ్చాయన్నారు. మే 20న పని ప్రదేశాల్లో, కలెక్టరేట్ల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, మండల కార్యదర్శి ఉపేందర్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ రజిత, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సాంబయ్య పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ భార్య ఆత్మహత్యా యత్నం

వేలేరు, మే 16 : వేలేరు ఎస్సైతో తన భర్తకు ప్రాణహాని ఉందని, ఎస్సై వేధింపులు తట్టుకోలేక మాజీ సర్పంచ్ భార్య ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం జరిగింది. బాధిత మహిళ కథనం ప్రకారం.. మండలంలోని కమ్మరిపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జోడుముంతల రమేశ్ భార్య రవళి వేలేరు ఎస్సై తన భర్తను పలు రకాల కారణాలతో ఇబ్బందులకు గురిచేస్తున్నాడని శుక్రవారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ప్రస్తుతం దవాఖానలో చికిత్స పొందుతున్నది. కాగా, ఈ విషయంపై వేలేరు ఎస్సై వివరణ కోరగా గతంలో కమ్మరిపేట గ్రామానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదుతో రమేశ్‌పై లైంగిక ఆరోపణల కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదే కక్షతో తనపై రమేశ్ భార్య తప్పుడు ఆరోపణలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కమ్మరిపేటలో రమేశ్ అతడి భార్య గొడవ పడినట్లు తన దృష్టికి వచ్చిందని ఎస్సై తెలిపారు. కావాలనే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఎస్సై చెప్పారు.

రోడ్లకు ఇరువైపులా చెట్ల తొలగింపు

శాయంపేట, మే 16 : పోలీసులు చొరవ చూపారు. రోడ్లకు ఇరువైపు పెరిగి ఇబ్బందులు సృష్టిస్తున్న చెట్లను తొలగించారు. మాందారిపేట నుంచి గట్లకానిపర్తి వరకు రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరిగాయి. తుమ్మ, ఇతర చెట్లు ఏపుగా పెరిగి కమ్ముకుపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఎస్సై జక్కుల పరమేశ్ శుక్రవారం సిబ్బందితో చెట్లను తొలగింపజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, మే 16 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. యాదవనగర్, బాలసముద్రం, కేయూసీ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8 నుంచి 10గంటల వరకు రెడ్డికాలనీ, పాల జెండా, బుద్ధభవన్, కుమార్‌పల్లి, బాలసముద్రం, ఈఫిల్ టవర్, సాయినగర్, లైబ్రరీ ఏరియా, బాలసముద్రం స్విమ్మింగ్ పూల్ ఏరియా, కంచరకుంట్ల, ఏషియన్ శ్రీదేవి మాల్, సాయిబాబా టెంపుట్ ఏరియా, ఈద్గా, పోచమ్మకుంట, ఉదయం 9గంటల 10గంటల వరకు కిషన్‌పుర, లష్కర్ బజార్, సిక్కువాడ, అలంకార్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 10గంటల వరకు వీపీ రోడ్డు, రియా ఆస్పత్రి, ములుగు క్రాస్ రోడ్డు, అజరా హాస్పిటల్, న్యూ భద్రకాళీ గుడి రోడ్డు, కాపువాడ ఏరియాల్లో, ఉదయం 8 నుంచి 10గంటల వరకు వడ్డేపల్లి సబ్‌స్టేషన్, సోమిడి సబ్‌స్టేషన్, వెస్ట్‌సిటీ సబ్‌స్టేషన్, ఉదయం 9 నుంచి 11గంటల వరకు టేకులగూడెం సబ్ స్టేషన్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.

NT-336370-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.